సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

చెరువులు, కుంటలకు భద్రత చర్యలు చేపట్టాలి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 1 : హెచ్ఎండీఏ పరిధిలోని జిల్లాలో గల మర్కూక్, ములుగు, వర్గల్ మండలాల్లో గల చెరువులు, కుంటలకు సంబంధించిన భద్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా మండల రెవెన్యూ, నీటిపారుదల, భూ సర్వే అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఎండీఏ పరిధిలో జిల్లాలోని మూడు మండలాల్లో మొత్తం చెరువులు, కుంటలను సర్వే అధికారులు భూ విస్తీర్ణం రికార్డులను పరిశీలించి మ్యాప్‌లను సిద్ధం చేయాలన్నారు. మండల రెవెన్యూ, భూ సర్వే, నీటి పారుదల శాఖ అధికారులు ఆయా చెరువులు, కుంటల ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్,ఏడీ సర్వేలాండ్ వినయ్, కలెక్టరేట్ ఏఓ రహమాన్, ఆయా మండల తాహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు1: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించిన ఆయా విభాగాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను అదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపైన అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 5479 అప్లికేషన్లు వచ్చాయని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణేశ్ రామ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఫీల్డ్ వెరిఫికేషన్ ఇంటింటికీ తిరిగి అన్ని వివరాలను సేకరించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగత్ కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

డాక్టర్ జ్యోతిలూంబాకు మెమెంటో అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

మర్కూక్, ఆగస్టు 1 : మర్కూక్ మండలం కర్కపట్ల గ్రామంలోని జోడాస్ ఎక్స్‌పోయిం కంపెనీ వారు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా గురువారం కంపెనీ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతిలూంబా, హెచ్ఆర్ శ్రీకాంత్‌తో పాటు సుమారు వెయ్యి మంది సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం ఎండీ జ్యోతి లూంబా మాట్లాడుతూ రక్తదానం మానవాలికి అత్యంత ముఖ్యమైనది సామాజిక సేవ అని అన్నారు. మనిషిగా మనం ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయాలని ఆయన తెలిపారు. ప్లాంట్ హెడ్స్ డాక్టర్ దత్త,ప్రశాంత్ నాయక్, సందీప్ మంజుదార్, ఓబుల్‌రెడ్డి, వినోద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి

వర్గల్, ఆగస్టు 1 : జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ధూపదీపనైవేద్య అర్చకులకు ప్రభుత్వం వెంటనే కనీసవేతనాలపెంపు, ఉద్యోగభద్రతను కల్పించాలని రాష్ట్ర అర్చకసంఘం అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. గురువారం వర్గల్‌మండలకేంద్రంలో జిల్లా అర్చక సంఘం అధ్యక్షతన అర్చక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవశర్మ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు చాలి చాలని వేతనాలతో వెతలుపడుతున్నారని ప్రభుత్వం కనీసవేతనాల పెంపు తోపాటు, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య, కోశాధికారి రాజా మనోహరశర్మ, ఉపాధ్యక్షులు దేశపతిశంకర్ శర్మ, పవన్‌శర్మ,బాలబ్రహ్మం, వేలేటి రామకృష్ణ శర్మ, ఫణిందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'కాచం' పేదల హక్కుల కోసం పోరాడిన నేత

కాచం కృష్ణమూర్తిచిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట ఆగస్టు 1: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కాచం కృష్ణ మూర్తి 18వ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్ మాట్లాడుతూ అమరజీవి కాచం కృష్ణమూర్తి నేటితరానికి స్ఫూర్తిదాయకమన్నారు. నాయకులు కాముని గోపాలస్వామి, చొప్పరి రవి కుమార్, ఐద్వా నాయకురాలు జాలిగపు శిరీష, వంగ రవీందర్ రెడ్డి, అంజయ్య, చంద్రకళ, అభినవ్, జనార్దన్ పాల్గొన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, ఆగస్టు 1 : పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలపై సీపీఎం పార్టీ పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం తెలంగాణ సాయుధ పోరాట సమరయోధుడు ఉమ్మడి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కాచం కృష్ణమూర్తి 18వ వర్ధంతిని నాయకులు నిర్వహించారు. పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, దర్శనం రమేశ్, తాడూరి నర్సింహులు, కృష్ణ మూర్తి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినందున మాలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేశ్ అన్నారు. తీర్పు రాజ్యాంగ విరుద్ధమని 341 ఆర్టికల్ తుంగలో తొక్కడమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సవాల్ చేస్తూ 9 మంది జడ్జీల బెంచ్‌కి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈరోజు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అత్యుత్సాహంగా ఆర్డినెన్స్ తెచ్చి ఇప్పటి నుంచి ఉద్యోగాలు ఇస్తామనడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించినందుకు మాలలకు వ్యతిరేకంగా మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో జంతర్ మంతర్ వద్ద 'హాలో మాల చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహించి మాలల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. పార్లమెంట్‌లో మాల ఎంపీల ద్వారా చట్టసభలు స్తంభింపచేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. నాయకులు బొమ్మల విజయ్ దేవదాసు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రాజు, మాజీ జిల్లా కార్యదర్శి ఎల్లేశ్, బొమ్మల అజయ్, సంపత్ కుమార్, ప్రవీణ్, పరశురాములు, సందీప్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలకు జరిమానా

బేకరికి జరిమానా విధిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 1 : ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న బేకరి, హోటల్స్‌పై మున్సిపల్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవా బేకరికి రూ. రెండువేలు, బెంగళూర్ బేకరికి రూ. రెండువేలు, హోటల్ దుర్గారెస్టారెంట్‌కు రూ. 500, రుచిబిర్యానీ పాయింట్‌కు రూ. 500, వీనస్‌మెస్‌కు రూ. 500, న్యూభావర్చి బిర్యానీ పాయింట్‌కు రూ. 500, లక్ష్మీ జనరల్‌స్టోర్‌కు రూ. రెండువేలు జరిమానా విధించిన్నట్లు శానిటర్ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం తెలిపారు. ఈ దాడుల్లో వనమహోత్సవం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారులు సువార్త, మమత, సాంబరాజు, ఎల్లయ్య, జవాన్లు సారయ్య, ప్రభాకర్ ఉన్నారు.

చేర్యాలలో సీఎం బిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్గల్‌లో సీఎం బిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

క్షమాపణ చెప్పాలి

సీఎం రేవంత్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరచడం బాధాకరమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లావ్యాప్తంగా నాయకులు, మహిళా, విద్యార్థి, యువజన విభాగం నాయకులు రహదారులపై రాస్తారోకో నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి బిష్టి బొమ్మలను దహనం చేశారు. చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని భేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, ఆగస్టు 1

దుబ్బాకలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరులో సీఎం రేవంత్‌రెడ్డి బిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

ధూళిమిట్టలో రేవంత్‌రెడ్డి బిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జగదేవ్‌పూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి బిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి) : రాజీవ్ రహదారిపై ర్యాలీగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ములుగులో సీఎం బిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సంబురాలు

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకొన్నారు. ఎన్నో ఏండ్లుగా వర్గీకరణ కోసం ఎదురుచూడగా, అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో సంబురాలు చేసుకున్నట్లు ఎమ్మార్పీఎస్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగకు ధన్యవాదాలు తెలిపారు.

-సిద్దిపేటజిల్లా నెట్‌వర్క్, ఆగస్టు 1

సిద్దిపేట పట్టణంలో ఎమ్మార్పీఎస్ సంబురాలు

సిద్దిపేట టౌన్ : హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్‌టౌన్: స్వీట్లు పంచుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బెజ్జంకి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, దళితసంఘాల ఆధ్వర్యంలో సంబురాలు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

విరలాపూర్ పౌరసరఫరాల శాఖ గిడ్డంగిలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

చిన్నకోడూరు, ఆగస్టు 1 : సీఎంఆర్ రైస్ డెలివరీలో మిల్లర్లు నాణ్యతాప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం చిన్నకోడూరు మండలం విరలాపూర్ గోదాంలో పౌర సరఫరాల సంస్థ సీఎంఆర్ రైస్ డెలివరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 2023 –24 వానకాలం లో 58. 62 శాతం సీఎంఆర్ డెలివరీ చేసి, ఇంకా 57,121 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ చేయవలసి ఉందన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాక, ఆగస్టు 1 : దుబ్బాక పట్టణంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వార్డు అధికారులకు మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ సూచించారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో 15 మంది వార్డు అధికారులతో కమిషనర్ రమేశ్‌కుమార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుత వర్షకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

అటల్ మారథన్‌లో విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్, ఆగస్టు 1: దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన అటల్ మారథన్ 2023-24 పోటీల్లో 500 టీమ్స్ పాల్గొనగా, ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన సీబీఎస్ఈ విద్యార్థులు సుహిత, వైష్ణవి ప్రతిభ కనబరిచారు. ఇద్దరు విద్యార్థులు కలిసి ప్రదర్శించిన 'వాక్‌అవే ట్రిజ్జి ఫర్ పీపుల్' ప్రాజెక్టు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్టులో ప్రధానంగా విద్యార్థులు రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్ ఫాం నుంచి మరో ప్లాట్ ఫామ్‌కు మారడంలో ఇబ్బందిని దూరం చేయడానికి రూపొందించారు. ఈ ప్రాజెక్టును నీతి అయోగ్ వారు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంపై విద్యార్థులు సుహిత, వైష్ణవి, ప్రాజెక్టు గైడ్ నాగలక్ష్మిలను పాఠశాల యాజమాన్యం గోపు ఇన్నారెడ్డి, ధామస్‌రెడ్డి, హెచ్ఎంలు విజయపాల్, రాయప్ప అభినందించారు.

అడిషనల్ డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ ధన్‌రాజ్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు1: సిద్దిపేట జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా సిద్దిపేట జిల్లాకు సాధారణ బదిలీలో భాగంగా డాక్టర్ ధన్‌రాజ్ నియమితులయ్యారు. గురువారం కలెక్టర్ మనుచౌదరిని కలెక్టర్‌రేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్, ఆగస్టు 1: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 30 మందిని గజ్వేల్ కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపర్చగా వారికి రూ.19,500 జరిమానా విధించారు. కొన్ని రోజులుగా వాహనాల తనిఖీని ట్రాఫిక్ సీఐ మురళీ ఆధ్వర్యంలో సిబ్బంది పిడిచేడ్ రోడ్డు, క్యాసారం ఎక్స్ రోడ్డు, మూ ట్రాజ్‌పల్లి, తూప్రాన్ రోడ్డు, సంగాపూర్, ఔటర్ రింగ్ రోడ్డులోని పరిసర ప్రాంతాల్లో నిర్వహించగా పట్టుబడినట్లు సీఐ మురళి తెలిపారు.

గౌరారం ఎస్సై సస్పెన్షన్

వర్గల్,ఆగస్టు1: విధినిర్వహణలో అక్రమాలకు పాల్పడిన గౌరారం ఎస్సై శివ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు జిల్లా సీపీ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. శివకుమార్ గత కొంతకాలంగా పోలీస్ విధుల నిర్వహణలో రూల్స్‌ను అతిక్రమిస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కారణంగా ఐజీపీ మల్టీజోన్ 1 రాజన్నజోన్ III ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి ఐపీఎస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌పోలీస్ ఇచ్చిన విచారణ నివేదికల ప్రకారం గురువారం సస్పెండ్ ఉత్తర్వులు జారీచేశారు. అక్రమాలకు,అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు.

గుండెపోటుతో రైతు మృతి

బోండ్ల పోచయ్య

గజ్వేల్, ఆగస్టు 1: గుండెపోటుతో రైతు మృతిచెందిన సంఘటన ములుగు మున్సిపల్ పరిధిలోని మూ ట్రాజ్‌పల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోండ్ల పోచయ్య(43) తన ముగ్గురు అన్నదమ్ములకున్న నాలుగెకరాల వ్యవసాయ భూమిని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణం కాళేశ్వరం కాల్వ కోసం గతంలో అధికారులు తీసుకున్నారు. ఒక్కొక్కరికి 12 గుంటల చొప్పున భూమిని ఇచ్చిన అధికారులు రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో కొన్ని రోజులు తహసీల్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగిన అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదన్నారు. బుధవారం గజ్వేల్ తహసీల్‌కు వెళ్లి అధికారులను సంప్రదించి బయటకు రాగానే చాతిలో నొప్పి రావడంతో వెంటనే అక్కడి నుంచి గజ్వేల్ ఏరియా దవాఖానకు అతడిని తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఆర్‌వీఎం దవాఖానకు తరలించగా, అక్కడి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పోచయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించి, సానుభూతి తెలిపి ఆర్థికసాయం అందజేశారు.

సామాజిక చైతన్య దీక్షల పోస్టర్ ఆవిష్కరణ

బెజ్జంకి, ఆగస్టు 1: మాలమహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే ఛలో ఢిల్లీ సామాజిక చైతన్య దీక్షల పోస్టర్‌ను మండల కేంద్రంలో జాతీయ మాలమహానాడు సాంస్కృతిక సారథి రాష్ట్ర అధ్యక్షుడు ఎలుక దేవయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7,8,9 తేదిల్లో నిర్వహించే దీక్షలకు పెద్ద సంఖ్యలో మాలమహానాడు నాయకులు తరలిరావలని కోరారు. పోస్టర్ ఆవిష్కరించిన వారిలో రాష్ట్ర పోలట్ బ్యూరో చైర్మన్ ర్యాకం రాజు, రాష్ట్ర కార్యదర్శి మేడి అంజయ్య, నాయకులు ఉన్నారు.

మెళకువలు పాటించాలి

చిన్నకోడూరు, ఆగస్టు 1 : చిన్నకోడూరు మండలంలోని విరలాపూర్ గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మ గురువారం వరి, పత్తి, మొక్కజొన్న పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు సాగుపై తగు సూచనలు చేశారు.

చెట్లను పరిరక్షించుకుందాం..

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 1: మానవ మనుగడకు చెట్లను పరిరక్షించుకోవాల్సి ఉందని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఎనిమిదో వార్డులో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లి కార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి

చేర్యాల, ఆగస్టు 1 : మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 1,2 వార్డులో గురువారం ఇంటింటా మొక్కల పంపిణీని నిర్వహించారు. వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది కృష్ణ, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడె మోస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

మృతుడి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్, ఆగస్టు 1: మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన నల్లా శ్రీధర్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ నాయకుడు జగపతి, నాయకులు అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు, ఆగస్టు 1: మండల పరిధిలోని ఎల్లాయపల్లి గ్రామానికి చెందిన కొమురెల్లి యాదవ కుటుంబాన్ని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి యాదవ్ గురువారం పరామర్శించారు. కొమురెల్లి యాదవ్ తల్లి భూలక్ష్మి మూడు రోజుల కింద మృతిచెందగా, విషయం తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు పయ్యావుల రాము లు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముల కల కుంటయ్య, రాజు యాదవ్, శ్రీ కాంత్ యాదవ్, బొల్లు రాము యాదవు లు పరామర్శించారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళం



ఏఈవో శ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న గాలయ్య ఉమారాణి దంపతులు

చేర్యాల, ఆగస్టు 1 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి సిద్దిపేట్ట పట్టణానికి చెందిన మంకాల గాలయ్య ఉమారాణి దంపతులు రూ. 50, 116 విరాళాన్ని అందించారు. స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్‌కు విరాళాన్ని అందజేశారు. ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకుడు మనోహర్ తదితరులు ఉన్నారు.

స్టాపర్ బోర్డుల ఏర్పాటుకు వినతి

కొండపాక(కుకునూరుపల్లి)/గజ్వేల్, ఆగస్టు 1: మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రాజీ వ్ రాహదారిపై పాఠశాల ముందు స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కుకునూర్‌పల్లి ఎస్సై శ్రీనివాస్‌కు పాఠశాల హెచ్ఎం మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. వెంటనే పోలీస్ శాఖ తరపున తగుచర్యలు తీసుకొని బోర్డులను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చేర్యాల, ఆగస్టు 1 : సిద్దిపేట, జనగామ జిల్లా సరిహద్దులలో గల మండల కేంద్రాలు, గ్రామాల్లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేర్యాల మండలంతో పాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం, గ్రామాల్లో సంజీవ్ కుమార్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో నిందితుడిని అరెస్టు చేసి విచారించి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సంజీవ్‌కుమార్ బచ్చన్నపేటకు చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, ఆగస్టు 1 : సిద్దిపేట బీజేఆర్ భవనంలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. విజయ్ కుమార్, రాణా ప్రతాప్, గణేశ్ కుమార్, దేవులపల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత, డాక్టర్ అందెశ్రీ

చేర్యాల, ఆగస్టు 1 : విద్యార్థులు ఇష్టంతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత, డాక్టర్ అందెశ్రీ అన్నారు. మండలంలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎలికట్టె అయిలయ్య ఆహ్వానం మేరకు అందెశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా అందెశ్రీ మాట్లాడుతూ చదువును మించిన సంపద సృష్టిలో లేదన్నారు. అనంతరం అందెశ్రీని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు కృష్ణ మూర్తి,పద్మ, విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, యాదగిరి, స్వర్ణకుమార్, శ్రీధర్,ఫమీం సుల్తానా, ఉమదర్, మంజుల ఘనంగా సన్మానించారు.

పాఠశాలలో అందెశ్